సాక్షి తిరుపతి

శనివారం । 21 । అక్టోబర్ । 2023



సమ్మోహనం

శ్రీవిద్యానికేతన్‌లో రెండు రోజులుగా మోహన మంత్ర-2023 కార్యక్రమం అట్టహాసంగా సాగుతోంది. - IIలో



అనుపమ సందడి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	23
చిత్తూరు	33	22
తిరుమల	29	19
గూడూరు	35	26
నగరి	33	22

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర గవర్నర్ రాక

తిరుపతి అర్బన్: జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం విచ్చేయనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డుమార్గాన తిరుమల వెళ్లి రాత్రి అక్కడే బస చేస్తారని తెలిపారు. అనంతరం ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని బెంగళూరు వెళ్లనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 66,757 మంది స్వామివారిని దర్శించుకోగా 26,395 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3 53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అమ్మవారి సేవలో మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్



భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ కుంకుమార్చన సేవలో దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని కుంకుమార్చన సేవలో అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీవీఎస్ లక్ష్మణ్‌తో ఫోటోలు భక్తులు దిగడానికి పోటీపడ్డారు.

ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన పథకం ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ కే.విజయప్రతాప్ శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగా తిరుపతిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేశారని, వంద శాతం శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. 15-45 ఏళ్ల మధ్య గల వారు అర్హులుగా పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు వివరించారు. ఆ మేరకు రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 27వ తేదీలోపు తిరుపతి అలిపిరి రోడ్డులోని మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న తమ కార్యాలయంలో చేయించుకోవాలని, అదనపు సమాచారం కోసం 9866241270, 7981155147 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దసరా సెలవులకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: దసరా సెలవుల నేపథ్యంలో శనివారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు 210 సర్వీసులు అదనంగా ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు అన్ని డిపోల మేనేజర్లకు ఆయన శుక్రవారం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాలతోపాటు ముఖ్యమైన అన్ని నగరాలు, పట్టణాలకు జిల్లాలోని వివిధ డిపోల నుంచి బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అంతేగాక గ్రామీణ ప్రాంతాలకు సైతం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు.

నేడు జిల్లాకు కేంద్రమంత్రి

చిత్తూరు కార్పొరేషన్: గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ తిరుపతి జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నట్టు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో శనివారం సాయంత్రం 4 గంటలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాత్రి 10 గంటలకు ఆర్సీ రోడ్డులోని సిద్ధేశ్వర బ్రహ్మర్షి ఆశ్రమాన్ని సందర్శించి, తిరిగి పద్మావతి అతిథిగృహానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారన్నారు. 22న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలకు చేరుకుని, రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకుంటారని తెలిపారు. 23న సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టు చేరుకుని అక్కడి నుంచి బయలుదేరి ఢిల్లీకి వెళ్లనున్నట్టు జెడ్పీ సీఈఓ తెలిపారు.



హనుమంత వాహనంపై శ్రీవేంకటేశ్వరుడు



పుష్పక విమానం



గజ వాహనంపై గోవిందుడు





వైభవోత్సవం..!

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సంబరంగా సాగుతున్నాయి. సప్త గిరులు భక్తసిరులతో నిండిపోతున్నాయి. తిరుమాడ వీధులు గోవిందనామస్మరణతో మార్మోగుతున్నాయి. సాంస్కృతిక సరాగాలు అంబరాన్ని తాకుతున్నాయి. విద్యుద్దీప కాంతులు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. విరబూసిన అందాలు భక్తులను రా..రమ్మని ఆహ్వానిస్తున్నాయి. దేవదేవుని దివ్య స్పర్శతో పునీతమవుతున్నాయి.

- మూడు వాహనాల్లో మురిపించిన ముగ్ధ మనోహరుడు
- ఉదయం హనుమంత, సాయంత్రం పుష్పక విమానం, రాత్రి గజ వాహనంపై ఊరేగిన శ్రీవారు
- తిరుమల కొండపై బ్రహ్మోత్సవ శోభ

తిరుమల: తిరుమలలో శుక్రవారం బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడింది. మలయప్ప మూడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను మురిపించారు. ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం పుష్పక విమానం, రాత్రి గజవాహనంపై ఊరేగుతూ భక్తకోటిని అనుగ్రహించారు. దేవదేవుని దివ్యమంగళరూపాన్ని దర్శించి భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగితేలారు. కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి వాహన సేవలు

ఉదయం సూర్యప్రభ వాహనం: బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజు శనివారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు ఊరేగుతూ కనువిందు చేయనున్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వాహన సేవ నిర్వహిస్తారు.

రాత్రి చంద్రప్రభ వాహనం: రాత్రి తెల్లటి వస్త్రాలు, పుష్ప మాలలు ధరించి చల్లని వాతావరణంలో తిరువీధుల్లో స్వామివారు చంద్ర ప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు తిరువీధుల్లో స్వామివారు ఊరేగనున్నారు.



జయజయరాం.. సీతారాం!



హనుమంత వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి



అమ్మా..పాహిమాం!



భక్తజన కాంతార!

శ్రీశక్తిపీఠంలో రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా

రామచంద్రాపురం: మండలంలోని శ్రీశక్తిపీఠంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, యువజన శాఖా మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఠ నిర్వాహకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రీకమలాత్మిక దేవి అలంకరణలో ఉన్న శ్రీమరకతశక్తి కాళీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీల ఆశీస్సులు పొందారు.



శ్రీశక్తిపీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆర్కే రోజా

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

పుత్తూరు రూరల్: ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అందించే ప్రగతి, సాక్ష్యం, స్వానాథ్ ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.కుమార్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఉపకార వేతనాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు జాతీయ స్థాయిలో 10 వేల మంది విద్యార్థినులకు ప్రగతి పేరిట ఒక్కో విద్యార్థినికి రూ.50 వేల ఉపకారవేతం అందించనున్నారు. ఇందుకు డిప్లొమా పాలిటెక్నిక్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థినులు అర్హులు. తొలి ఏడాది దరఖాస్తు చేసుకొన్న వారికి ద్వితీయ, తృతీయ ఏడాదిలో మెరిట్‌ను బట్టి ఉపకార వేతనాన్ని రెన్యూవల్ చేస్తారు. పాలిటెక్నిక్ పూర్తి చేసుకొని బీటెక్ రెండవ ఏడాది లేటరల్ ఎంట్రీలో సీట్లు పొందిన విద్యార్థినులు సైతం ప్రగతి స్కాలర్‌షిప్‌కు అర్హులు. సాక్ష్యం పేరిట దివ్యాంగులైన విద్యార్థులకు రూ.50 వేలు చొప్పున ఉపకార వేతనం అందిస్తున్నారు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయినా, ఇద్దరిలో ఒకరిని కోల్పోయి అనాథలైన విద్యార్థులకు ఆర్మీ పేరిట, పారా మిలటరీలో పనిచేస్తూ ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు స్వానాథ్ పేరిట ఉపకారవేతనాలను రూ.50 వేలు చొప్పున అందిస్తారు. ఈ కేటగిరీలకు చెందిన విద్యార్థులు డిసెంబర్ 31వ తేదీ లోపు సంబంధిత పత్రాలతో కళాశాలలోని సివిల్ విభాగం అధ్యాపకులు వెంకటేష్‌ను సంప్రదించాలి. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అధ్యాపకులు సుగుణ, సృజన, రామకృష్ణ, వేలాయుధాచారి, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ ఎస్వీకుమార్

జగన్ సీఎం అయ్యాకే అభివృద్ధి ఆరంభం





బోయకొండ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆలయం వద్ద ఆశీర్వాద మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

- రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- బోయకొండ గంగమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ
- రూ.4 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభం

చౌడేపల్లె: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాతనే రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ అభివృద్ధి మొదలైందని రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కుటుంబ సమేతంగా హాజరై బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం గంగాపురంలో నూతన పాలక మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన బహిరంగ సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటినుంచి బోయకొండ క్షేత్రాన్ని దశలవారీగా ఊహించని రీతిలో అభివృద్ధి చేశామని తెలిపారు. తాను ప్రతిపక్షంలోని శాసన సభ్యుడిగా ఉన్నప్పుడు పుంగనూరు నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేయాలని అనుకున్నానో అవన్నీ ఇప్పుడు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతం తాగునీటి, సాగునీటికి దుర్భిక్షంగా మారిందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించి పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవుల పల్లె, తంబళ్లపల్లె మండలం ముదివేడు రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అయితే ఈ ప్రాజెక్టులు పూర్తయితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకట్ట వేశారని వివరించారు. అయినప్పటికీ రిజర్వాయర్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ నాలుగేళ్లలో పుంగనూరులో ఆర్టీసీ డిపో, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, అత్యంత సుందరంగా రోడ్లు, బైపాస్ రోడ్లు, పట్టణంలో డబుల్‌రోడ్డు నిర్మించామన్నారు. ఇంత అభివృద్ధి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనమందరం కలిసి మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు, చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని కొనియాడారు. మేనిఫెస్టోలో చంద్రబాబు హామీల వర్షం కురిపించి, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలను మట్టిలో కలిపేస్తారని విమర్శించారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తిచేశారని గుర్తుచేశారు.

బోయకొండలో అభివృద్ధి పనులు ప్రారంభం

పుణ్యక్షేత్రమైన బోయకొండలో రూ.4 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం రూ.32 లక్షలతో నిర్మించిన పెద్ద భోగ మండపం, రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన ఆశీర్వాద మండపం, రూ.25 లక్షలతో నిర్మించిన సెక్యూరిటీ, 130 సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను, ఔట్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. రూ.75 లక్షలతో అదనపు పార్కింగ్ ప్రాంగణం, రూ.54 లక్షలతో నిర్మించిన 9 స్వాగత తోరణాలను, రూ.50 లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. భవానీ నగర్ వద్ద రూ.17 లక్షలతో నిర్మించనున్న ముఖ ద్వార నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పాదలపల్లె వద్ద ఆదర్శ రైతు డాక్టర్ మోహన్‌రెడ్డి హార్టికల్చర్ ద్వారా నిర్మించిన ఏసీ ప్యాక్ హౌస్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన సతీమణి స్వర్ణలత, శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి సంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి మంత్రి పెద్దిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారికి నూతన ఆశీర్వాద మండపంలో జ్ఞాపికతోపాటు పవిత్ర తీర్థ ప్రసాదాలను చైర్మన్, ఈవో కలిసి అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు.



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు

అంతర్జాతీయ ప్రమాణాలతో ఎస్వీ మ్యూజియం

తిరుమల: తిరుమలలోని ఎస్వీ మ్యూజియం అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమవుతోందని మ్యూజియం అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. తిరుమల రాంభగీచా-2లోని మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీసీఎస్ సంస్థ రూ.125 కోట్లు, బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ రూ.20 కోట్లు కలిపి మొత్తం రూ.145 కోట్ల విరాళంతో నూతన హంగులతో మ్యూజియం రూపుదిద్దుకుంటోందన్నారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీని వినియోగించి 3డీ, 7డీ హంగులతో టీసీఎస్ 14, మ్యాప్ సిస్టమ్స్ 5 కలిపి మొత్తం 19 గ్యాలరీలతో ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో తిరువీధులు,తిరుమల ఆలయ అనుభూతి, వాహన సేవలు, స్వామివారి సేవలు, సప్తగిరుల గ్యాలరీలు ఉన్నాయని, వీటిని బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ వారు అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. మిగతా గ్యాలరీలను టీసీఎస్ సంస్థవారు ఆధునీకరిస్తున్నారని చెప్పారు. మ్యూజియం అభివృద్ధి పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కానున్నాయని చెప్పారు. టీటీడీ పీఆర్వో టీ.రవి, ఏపీఆర్వో కుమారి పీ.నీలిమ, మ్యూజియం క్యూరేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

వేదాల్లో అనంత విజ్ఞానం

తిరుమల: పూర్వీకులు అందించిన వేదాల్లో అనంతమైన విజ్ఞానం దాగి ఉందని బెంగళూరులోని సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కేవీ దేవనాథన్ తెలిపారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల నాదనీరాజనం వేదికపై జరుగుతున్న శ్రీనివాస వేద విద్వత్ సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఆచార్య దేవనాథన్ మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితమే సూర్యమండలం, భూమ్యాకర్షణ, గణితం, ఖగోళశాస్త్ర సంబంధిత విషయాలు వేదాల్లో తెలియజేశారని తెలిపారు.

భారీగా వైఎస్సార్ సీపీలో చేరిక

శ్రీకాళహస్తి: పట్టణంలో శుక్రవారం బీజేపీ మైనారిటీ మోర్చా రేణిగుంట మండల నాయకులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యేను వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం జగనన్నను మరోసారి సీఎంని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. షేక్ మహమ్మద్, ఖాజా, అమీర్, అంజి, అలి, మాబాషా, మిను, జాఫర్, బన్నీ, రషీద్ పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులతో ఎమ్మెల్యే బియ్యపు మధు

7 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలోని కోరమేను గుంటలో అక్రమంగా విక్రయిస్తున్న ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఏడుగురిని అరెస్ట్ చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం.. తిరుపతి పరిసర ప్రాంతాలతో పాటు నెల్లూరు, వెంకటగిరికి చెందిన ఏడుగురు వ్యక్తులు కోరమేను గుంటలోని పోస్టల్ కాలనీలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఈ మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించగా ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తారసపడ్డారు. విచారణలో వారు గంజాయి విక్రయిస్తున్నట్టు తేలింది. ఆపై వారి నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టు తరలించగా.. కోర్టు నిందితులకు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.



సమ్మోహనం

- సమ్మోహన పరిచిన మోహనమంత్ర-2023
- వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు


ర్యాంప్ వాక్

చంద్రగిరి: శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల్లో రెండు రోజులుగా జరుగుతున్న మోహన మంత్ర-2023 కార్యక్రమం ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి దాదాపు 16 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. శుక్రవారం నిర్వహించిన పలు సాంకేతిక యాప్‌లకు సంబంధించి విద్యార్థులు నిర్వహించిన వర్క్‌షాపులు వారి మేథోశక్తికి నిదర్శనంగా నిలిచాయి. విద్యార్థులు వివిధ రకాల స్పాట్ ఈవెంట్స్‌లో పాల్గొని మానసిక ఉత్సాహంతో పాటు పోటీతత్వాన్ని రుచిచూశారు. కళాక్షేత్రంలో విద్యార్థులు నిర్వహించిన నృత్య, గాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఫన్ గేమ్స్, లక్కీడ్రా, డీజేహౌస్, హర్రర్ హౌస్, డిజిటల్ ఈవెంట్స్, ఫుడ్ చాలెంజ్, ట్యాలెంట్ ఎగ్జిబిషన్, గల్లీ క్రికెట్, రింగ్ టాస్, ఫ్లాగ్ పాటింగ్, ఎస్కేప్ రూం, బ్రేక్ డ్యాన్స్, కొలంబస్, డ్రాగన్ ట్రెన్, వాటర్ వాక్ వంటి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఒకవైపు సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా టెక్నికల్ విభాగంలో విద్యార్థుల ప్రదర్శనలు మైమరపించాయి.

ర్యాంప్ వాక్ అదరహో

ర్యాంప్‌పై విద్యార్థులు తమ అందచందాలతో హొయలొలికిస్తూ నేటి మోడల్స్‌ను తలదన్నేలా క్యాట్ వాక్‌తో అదరహో మనిపించారు. సంప్రదాయ వస్త్రాధారణ నుంచి పాశ్చాత్య సంప్రదాయ వస్త్రాలతో ట్యాలెంట్‌ను నిరూపించుకున్నారు.

డీజే షో!

రాత్రి ముంబాయికి చెందిన ప్రముఖ గాయని డిస్కో జాకీ ఫరోమ చటర్జీ కౌషిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీజే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లైవ్ మ్యూజిక్ షోలు ఔరా అనిపించాయి.


లక్కీడిప్ విజేతకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న వీసీ నాగరాజ రామారావు

బహుమతుల ప్రదానం

మోహన మంత్ర కార్యక్రమంలో సుమారు 5 వేల మందికిపైగా విద్యార్థులకు టోకన్లు జారీచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంబీయూ వీసీ ఆచార్య నాగరాజ రామారావు లక్కీ డ్రా విజేతలను ప్రకటించారు. ప్రథమ బహుమతి పూర్ణచంద్రారెడ్డికి ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతి తోషిత్‌కు ట్యాబ్, తృతీయ బహుమతి వెంకట్‌కు సైకిల్‌ను అందించారు.


ప్రముఖ గాయని డిస్కో జాకీ డీజేషో


ర్యాంప్ వాక్‌లో విద్యార్థిని

ఘనంగా ఆర్‌ఎస్ బ్రదర్స్ ప్రథమ వార్షికోత్సవం

– వేడుకల్లో సినీతార అనుపమ పరమేశ్వరన్ సందడి

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీతార అనుపమ పరమేశ్వరన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆర్‌ఎస్ బ్రదర్స్ అధినేతలు, సిబ్బంది, కస్టమర్ల నడుమ కేక్ కట్ చేసి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి పాదాల చెంతనున్న ఆర్‌ఎస్ బ్రదర్స్ ప్రథమ వార్షికోత్సవానికి తాను అతిథిగా రావడం మహద్భాగ్యమన్నారు. విశాలమైన షోరూం, ప్రజల షాపింగ్‌కు అనువైన విధంగా ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూం ఉందన్నారు. దసరా వేళ సరికొత్త డిజైన్లతో అద్భుత రీతిలో వస్త్రాలు అందుబాటులో ఉంచారన్నారు. అంతేగాక వార్షికోత్సవం సందర్భంగా కస్టమర్లకు అద్భుతమైన ఆఫర్లు కల్పించడంతో పాటు ప్రతి రూ.1000 కొనుగోలుపై స్పాట్‌గిఫ్ట్ అందించడం సంతోషకరమన్నారు. అనంతరం ఆర్‌ఎస్ బ్రదర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు సిర్న సురేష్, కేశవ్ గుప్తా మాట్లాడుతూ ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూం వార్షికోత్సవం సందర్భంగా వస్త్రాలు కొనుగోలుపై అద్భుతమైన, కచ్చితమైన ఆఫర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని రకాల వస్త్రాలను సరసమైన ధరలకే అందించడంతో పాటు కస్టమర్లను ఆకర్షించే విధంగా ఆధునాతనమైన డిజైన్లలో వస్త్రాలను అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. ఎస్‌బీఐ కార్డ్‌పై 5 శాతం క్యాష్ బ్యాక్ కల్పిస్తున్నట్టు తెలిపారు. షోరూం ప్రతినిధులు నవీన్, నరసింహ, శ్రావణ్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న సినీ నటి, ఆర్‌ఎస్ బ్రదర్స్ అధినేతలు

షుగర్ ఫ్యాక్టరీకి నోటీసులు

నింద్ర: విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీకి శుక్రవారం సంబంధిత శాఖ అధికారులు నోటీసులు జారీచేసినట్టు ఏఈ చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి డివిజన్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పుత్తూరు డివిజన్ పరిధిలోని పరిశ్రమలు విద్యుత్ బకాయిలు సక్రమంగా చెల్లించడంలేదన్నారు. అలాంటి వారికి రెవెన్యూ రికవరీ యాక్టు కింద నోటీసులు జారీచేసినట్టు వెల్లడించారు. నింద్ర నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ విద్యుత్ బకాయిల కింద 20 లక్షల 26 వేల రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఏఓ శ్రీనివాసులు, ఎస్ఏ జోషఫ్ ఉన్నారు.


విద్యుత్ బాకాయిలు చెల్లించాలని ఫ్యాక్టరీ వద్ద అతికించిన నోటీసు

యువతి అదృశ్యం

పుంగనూరు: పట్టణంలోని ఏవిరావు వీధిలో నివాసం ఉన్న మధుసూదన్‌శెట్టి కుమార్తె వినుత(23) అదృశ్యమైనట్లుగా పోలీసులు కేసు నమోదు చేశారు. వినుత గురువారం గోరింటాకు తీసుకొస్తానని బజారుకెళ్లి తిరిగి రాలేదని తండ్రి మధుసూదన్‌శెట్టి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


వినుత (ఫైల్)









